

భద్రాచలం సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా

## 'గ్యారెంటీ'లపై నిలదీయాలి

- పాలన చేతగాని కాంగ్రెసోళ్లు కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు
- నేతల సమావేశంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కాంతారావు

భద్రాచలం, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారెంటీలపై నిలదీయాలని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ ఇన్‌చార్జిల సమావేశంలోఆయన మాట్లాడారు. అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీతో నాలుగు నెలలుగా గోస పడుతున్నామని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో మరోసారి మోసపోకుండా ఉందామని అన్నారు. ఇందుకోసం బీఆర్ఎస్‌కు ఓటు వేసి మాలోత్ కవితను గెలిపించాలని కోరారు. ఇందుకోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీని ప్రశ్నించే దమ్మున్న ఏకైక వ్యక్తి కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజల సౌలభ్యం కోసం కేసీఆర్ ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలను ఇప్పటి ప్రభుత్వం రద్దు చేస్తామంటుండడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్‌ను తిట్టడం తప్ప ఈ ప్రభుత్వానికి ఏమీ చేతకావడంలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు మానె రామకృష్ణ, ఆకోజు సునీల్‌కుమార్, పడిశిరి శ్రీనివాస్, రేపాక పూర్ణ, ఉడతా రమేశ్, కోలా రాజు, వీరబోయిన వెంకటనర్సమ్మ, కావూరి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

## బీఆరెస్సే మన ఇంటి పార్టీ..

- కారు గుర్తుకు ఓటేసి 'నామా'ను అధిక మెజార్టీతో గెలిపించాలి
- ఉపాధి హామీ పనుల వద్ద మాజీ ఎమ్మెల్యే కందాల ప్రచారం



ఖమ్మంలో రూరల్లో ఉపాధి హామీ కూలీల వద్ద ఓటు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాల

ఖమ్మం రూరల్, మే 3 : కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీ పార్టీలని, బీఆర్ఎస్ మాత్రమే మన ఇంటి పార్టీ అని, బీఆర్ఎస్ తరపున ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామా నాగేశ్వరరావు కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కోరారు. నామా విజయాన్ని కాంక్షిస్తూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్‌తో కలిసి మండలంలోని మంగళగూడెం, తీర్థాల, గోళ్లపాడు గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. మండుటెండలో ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం కందాల మాట్లాడుతూ మన సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో కొట్లాడే నామా నాగేశ్వరరావుకు మంచి మెజార్టీ ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా మోసపోమని, కచ్చితంగా కారు గుర్తుకు ఓటేసి గుండెల్లో పెట్టుకుంటామని పలువురు కూలీలు భరోసా ఇచ్చారు. సుడా మాజీ డైరెక్టర్ గూడ సంజీవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఏనుగుల రాకేశ్‌రెడ్డికి ఎమ్మెల్సీ చాన్స్

- వరంగల్-ఖమ్మం-నల్గొండ 'పట్టభద్రుల' అభ్యర్థిగా ఎంపిక
- ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత



హనుమకొండ, మే 3: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డికి అవకాశం దక్కింది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. ఇక్కడ ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహించిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇందుకుగాను కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. నల్లగొండ కలెక్టర్ ఈ నెల 2న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా అదే రోజు నుంచి 9 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. అధికారులు వెల్లడించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 4,61,806 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో మహిళా ఓటర్లు 1,74,794 మంది, పురుషులు 2,87,007 మంది, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురు ఉన్నారు.

# మ(ఘ)న విజయాన్ని చరిత్రలో నిలుపుదాం

- బీఆర్ఎస్ గెలుపులో నాయకులు, కార్యకర్తలదే ప్రధానపాత్ర కావాలి
- కేసీఆర్ నాయకత్వంలో వందేళ్ల అభివృద్ధిని పదేండ్లలోనే సాధించాం
- ఖమ్మం పార్లమెంటు స్థానాన్ని గెలిచి అధినేత కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం
- కాంగ్రెస్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఈ ఎన్నికల్లో ప్రతిబింబింపజేయాలి
- బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు



ఖమ్మం సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అజయ్, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి నామా, వద్దిరాజు, తాతా మధు

ఖమ్మం, మే 3: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఖమ్మం పార్లమెంటు ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదం, నాయకులు, కార్యకర్తల కృషితో సాధించబోయే మన విజయం చరిత్రలో నిలిచిపోవాలని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ భవన్‌లో కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్ల స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ గెలుపులో కార్యకర్తలదే ప్రధానపాత్ర అన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ సారథ్యంలో కేవలం పదేండ్లలోనే వందేండ్ల అభివృద్ధిని సాధించుకున్నామన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేసిన ఉచిత హామీలు, అమలు వీలుకాని వాగ్దానాలను ప్రజలు నమ్మి నిలువునా మోసపోయారని అన్నారు. సంక్షేమ పథకాలు అమలుకావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ గెలుపు కాంగ్రెస్‌కు గుణపాఠం కావాలన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం ప్రజలు చరిత్రను తిరగరాయనున్నారని అన్నారు. నామా గెలుపు కోసం ప్రతి బూత్‌లెవల్ కమిటీ సభ్యుడు గడపగడపకూ వెళ్లి ఓట్లను అభ్యర్థించాలన్నారు. నామాకు ఖమ్మం నియోజవర్గంలోనే అత్యధిక మెజార్టీ వస్తుందన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ జిల్లా ప్రయోజనాల కోసం తనదైన స్థాయిలో పార్లమెంట్ వేదికగా కృషిచేసిన వ్యక్తి నామా అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక అతి తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత పెరిగిందన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ప్రతి కార్యకర్త నామా గెలుపు కోసం తీవ్రంగా శ్రమించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో కొట్లాడిన వ్యక్తి నామా అన్నారు. ఖమ్మం గెలుపు కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ, కార్పొరేటర్ కర్నాటి కృష్ణతో పాటు పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాల్వంచ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**పాల్వంచలో కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి 'నామా'**

పాల్వంచ, మే 3: శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విమర్శించారు. పాల్వంచలో శుక్రవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ సారథ్యంలో పదేళ్ల కాలంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేసిందన్నారు. తెలంగాణను సస్యశామలం చేసి.. రెండు పంటలు పండేలా చేసిన రాష్ట్రాన్ని అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కోలుకోకుండా చేసిందన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయారని, ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో కూడా మోసపోవద్దన్నారు. నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల పరిశీలకుడు వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు మంతపురి రాజుగౌడ్, కిలారు నాగేశ్వరరావు, మల్లెల రవిచంద్ర, విశ్వనాథం, శ్రీరాంమూర్తి, మడి సరస్వతి, సింధుతపస్వీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 'నామా' గెలుపు కోసం ఇంటింటి ప్రచారం



సత్తుపల్లి టౌన్: ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం సత్తుపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 5వ వార్డులో ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి నామాకు భారీ మెజార్టీతో గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు.

–సత్తుపల్లి టౌన్, మే 3

## ఖమ్మంలో 'నామా' గెలుపే లక్ష్యం

- 6, 8 తేదీల్లో ముదిగొండ, బోనకల్లులో బీఆర్ఎస్ అభ్యర్థి రోడ్‌షోలు
- శ్రేణులు విజయవంతం చేయాలి: జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు



ముదిగొండలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లింగాల

బోనకల్లు/ ముదిగొండ, మే 3: బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు కోరారు. శుక్రవారం బోనకల్లు మండలం రావినూతల గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు నివాసంలో, ముదిగొండ మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నామా గెలుపును కాంక్షిస్తూ విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ముదిగొండలో ఈ నెల 6న ప్రచార సభ, బోనకల్లులో ఈ నెల 8న అభ్యర్థి నామా నాగేశ్వరరావు రోడ్ షో నిర్వహించనున్నారని, వీటిని విజయవంతం చేయాలని కోరారు. ఆయా సమావేశాల్లో బీఆర్ఎస్ నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు మోదుగుల నాగేశ్వరరావు, వేమూరి ప్రసాద్, కాకాని శ్రీనివాసరావు, గద్దల వెంకటేశ్వర్లు, ఇటికాల శ్రీనివాసరావు, జెర్రిపోతుల రవీందర్, తన్నీరు పుల్లారావు, వెంగళ కనకయ్య, ముదిగొండ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులు మందరపు ఎర్ర వెంకన్న, పసుపులేటి వెంకట్, పచ్చ సీతారామయ్య, తోట ధర్మారావు, సిల్వరాజు, బంక మల్లయ్య, పోట్ల రవి తదితరులు పాల్గొన్నారు.



పనుల వివరాలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

### సర్కారు బడులలో

## సకల సౌకర్యాలుండాలి

- పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తి కావాలి
- బూర్గంపహాడ్ పర్యటనలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

బూర్గంపహాడ్, ఏప్రిల్ 3: విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో సకల సౌకర్యాలు కల్పించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బూర్గంపహాడ్‌లోని ఎస్టీబీహెచ్ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాన్ని సందర్శించిన ఆయన తరగతి గదుల్లో వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 12కు వారం ముందే పాఠశాలల్లో ఏమైనా మరమ్మతులు ఉంటే పూర్తి చేయాలన్నారు. మంచినీటి ట్యాంకులు శుభ్రంగా ఉంచాలని, వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడా బెడ్లు ఉంచాలని, ప్రహరీలకు సున్నం వేయించాలని స్పెషల్ ఆఫీసర్, డీటీఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఆశ్రమ పాఠశాల, వసతి గృహం హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయుడు రమేశ్ పాల్గొన్నారు.

## బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి

**రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో ప్రక్రియ: భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక**



పార్టీల నేతల సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, మే 3 (నమస్తే తెలంగాణ): జిల్లాకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక చెప్పారు. శుక్రవారం కొత్తగూడెంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన 1,931 బ్యాలెట్ యూనిట్లకు రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. పినపాక నియోజకవర్గానికి 312, ఇల్లెందు 302, కొత్తగూడెం 632, అశ్వారావుపేట 460, భద్రాచలం నియోజకవర్గానికి 225 బ్యాలెట్ యూనిట్లు కేటాయించామన్నారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో మధు, తహసీల్దార్ పుల్లయ్య, ఎలక్షన్ డీటీ రంగాప్రసాద్, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్, పార్టీల నేతలు పాల్గొన్నారు.

## మున్నేరు కరకట్ట పనులపై మంత్రి తుమ్మల సమీక్ష

ఖమ్మం, మే 3: ఖమ్మం నగరంలో మున్నేరుకి ఇరువైపులా నిర్మిస్తున్న సీసీ ప్రొటెక్షన్ వాల్ పనులపై నిర్మాణ సంస్థ ప్రతినిధులతో రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం నగరంలోని వీడీవోస్ కాలనీలో గల క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మున్నేరుకు ఇరువైపులా గృహాలు నిర్మించుకున్న వారితో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఖమ్మంలో నానాటికి పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని బైపాస్ రోడ్డు నుంచి ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వరకు ప్రొటెక్షన్ వాల్‌ను అనుకుని డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు.

## గ్రాడ్యుయేట్స్ 'ఎమ్మెల్సీ'కి రెండో రోజు ఐదుగురు నామినేషన్

నల్లగొండ, మే 3: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నికలో భాగంగా శుక్రవారం రెండో రోజు ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) 2 సెట్లు, అలియన్స్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా ఈడ శేషగిరిరావు 1 సెట్, తెలంగాణ సకల జనుల పార్టీ అభ్యర్థిగా నందిపాటి జానయ్య 1 సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా మాధవపెద్ది వెంకట్‌రెడ్డి 1 సెట్, చాలిక చంద్రశేఖర్ 2 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరు నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్.మహేందర్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ నెల 9 వరకు నామినేషన్ల స్వీకరణ జరుగనుండగా.. 10న స్క్రూటినీ, 13న ఉపసంహరణ ఉంటుంది.

# జిల్లాలో హోం ఓటింగ్ షురూ..

- ఈ నెల 8వ తేదీ వరకు ఓటింగ్ ప్రక్రియ
- జిల్లాలో 865 మంది హోం ఓటర్ల గుర్తింపు
- వయో వృద్ధులు, దివ్యాంగులకు వెసులుబాటు
- ఉద్యోగులకు అందుబాటులో పోస్టల్ బ్యాలెట్
- పార్లమెంట్ ఎన్నికల కోసం 1,163 కేంద్రాలు



భద్రాద్రి జిల్లాలో వృద్ధురాలితో హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బంది

భద్రాద్రి కొత్తగూడెం, మే 3 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, వయసురీత్యా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ పోలింగ్ కేంద్రానికి రాలేని వారి కోసం 'హోం ఓటింగ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక జిల్లావ్యాప్తంగా 50 రూట్లలో 41 బృందాలను నియమించడంతో వారు ఓటర్ల ఇంటికి వెళ్లి ఓట్లు వేయించారు. శుక్రవారం నుంచి ఈ నెల 8 వరకు హోం ఓటింగ్ జరగనున్నది. జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులు 865 మంది ఉన్నట్లు గుర్తించారు. తొలిరోజు చర్ల ప్రాంతంలో హోం ఓటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.


### కొత్త ఓటర్లకు ఎపిక్ కార్డులు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓటర్లకు ఎపిక్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 78,890 మందికి కార్డులు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 77,001 మందికి పంపిణీ చేశారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఆయా ఏఆర్‌వోలు ఇప్పటికే మారుమూల గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించారు.

### 1,163 పోలింగ్ కేంద్రాలు

ఎన్నికల కోసం జిల్లాలో 1,163 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. 1,163 పీవోలు, 1,163 మంది ఏపీవోలు, 2,328 మంది ఓపీవోలను నియమించారు. మైక్రో అబ్జర్వర్లు 240 మంది, 2,250 మంది పోలీస్ సిబ్బంది, అదనపు సిబ్బంది 1,037 మందిని నియమించారు.

### 4,696 మందికి పోస్టల్ బ్యాలెట్లు



ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, అధికారులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారు ఆయా నియోజకవర్గాల్లో ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలి. జిల్లాలో 4,696 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు.

–డాక్టర్ ప్రియాంక, భద్రాద్రి కలెక్టర్



పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో సూచనలిస్తున్న ఖమ్మం కలెక్టర్, హోం ఓటింగ్ వినియోగించుకుంటున్న వృద్ధురాలు

## పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభం: ఖమ్మం కలెక్టర్

ఖమ్మం, మే 3: ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో శుక్రవారం నుంచి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగనున్నదని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సహకారనగర్‌లో హోం ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85 ఏళ్లు పైబడిన, దివ్యాంగులు, పోలింగ్ కేంద్రానికి రాలేని వారికి ఇంటివద్దకే వచ్చి బ్యాలెట్ పద్ధతిన ఓటుహక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 2,504 ఓటర్ల నుంచి 12డీ ద్వారా దరఖాస్తు స్వీకరించి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఏరోజుకారోజు పోలైన, పోల్ కానీ పోస్టల్ బ్యాలెట్లను సంబంధిత సహాయ రిటర్నింగ్ అధికారికి అందజేస్తారని, సహాయ రిటర్నింగ్ అధికారి పూర్తి భద్రతతో వాటిని భద్రపరుస్తారని తెలిపారు. సహాయ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

**ఎన్నికల సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకోవాలి**

ఎన్నికల విధుల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. పాలేరు, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రాజకీయ పార్టీల ఏజెంట్లకు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గురించి వివరించారు. త్వరితగతిన ఓటింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

**చెక్‌పోస్టు తనిఖీలో ఎన్నికల పరిశీలకుడు కోల్టే**

ముదిగొండ, మే 3: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల పరిశీలకుడు కోల్టే అన్నారు. ఎన్నికల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా శుక్రవారం మండలంలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు నిబంధనల ప్రకారం ఉన్నాయా? లైటింగ్, తాగునీరు, శానిటేషన్ తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సమయం పెంచినందున దానికి అనుగుణంగా లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం వల్లభి గ్రామంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించారు. నిబంధనల ప్రకారం వాహనాలను తనిఖీ చేయాలని మద్యం, నగదు తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ఎలాంటి వస్తువులను తరలించినా వాటిని సీజ్ చేయాలని సిబ్బందికి సూచించారు.



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎన్నికల పరిశీలకుడు కోల్టే